www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 ఏప్రిల్ 2023

5

తిరుపతి





జై 'వందేభారత్'

వందేభారత్ రైలు సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వాయువేగంతో రాత్రి 10 గంటలకు దూసుకొచ్చింది.. శ్రీకాళహస్తిలో ఎంపి గురుమూర్తి, ఎంఎల్ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఎక్కి స్వాగతం పలికారు. అయితే ఇది 'పేదల' రైలు కాదని, 'పెద్దల' రైలు అని ఛార్జీలను బట్టి విమర్శలు వస్తున్నాయి. విమాన ఛార్జీలను మించి ఉందని వామపక్షాలు మండిపడుతున్నాయి. ఏదిఏమైనా సమయాభావం తగ్గడాన్ని స్వాగతించాల్సిందే..

తిరుపతి జిల్లా వైసిపిలో...

మూడు 'రిజర్వ్‌డ్'లోనూ మార్పే..!

సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరుల్లో కొత్తవారే
గూడూరు నుంచి 'ఆర్డీవో' కిరణ్‌కుమార్ పోటీ..?
సూళ్లూరుపేట నుంచి ఓ ప్రముఖ డాక్టర్ పేరు

ఆదిమూలం

కిలివేటి సంజీవయ్య

వరప్రసాద్

తిరుపతి జిల్లాలో మూడు రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పు ఖాయమని సమాచారం. సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు నియోజక వర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల పనితీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తోంది. ఎన్నికలు ఇంకా ఏడాదే ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై సీఎం జగన్ తీవ్రంగా కసరత్తు చేస్తున్న సంగతి తెలిసిందే. వివిధ సంస్థల సర్వే నివేదికల ఆధారంగా సిట్టింగ్ ఎమ్మెల్యేల కొనసాగింపు, కొత్త అభ్యర్థుల ఎంపికపై ఎప్పటికప్పుడు జగన్ సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. నాలుగో రిజర్వ్‌డ్ స్థానమైన జీడీనెల్లూరులో ప్రస్తుతం డిప్యూటీ సిఎం నారాయణస్వామి సిట్టింగ్‌గా ఉన్నారు. అయితే నారాయణస్వామిపైనా ఆ నియోజకవర్గంలో 'రెడ్డి' సామాజికవర్గం నుంచి పూర్తి వ్యతిరేకత ఉంది. 'ఇబ్బంది పెడుతున్న వారితో ఎలా సర్దుకుపోవాలి' అని ఎస్ఆర్‌పురంలో శుక్రవారం జరిగిన గృహసారథుల సమావేశంలో ఆయన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. అయితే నారాయణస్వామిని నియోజకవర్గంలో మార్పు చేయకపోయినా వ్యతిరేకవర్గం నుంచి ఆ పార్టీకి ఇబ్బందనే చెప్పవచ్చు.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి జిల్లాకు సంబంధించి మూడు నియోజకవర్గాలపై సీఎం జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్‌ను మార్చడానికి జగన్ నిర్ణయించుకున్నారు. అలాగే కొత్త అభ్యర్థిగా గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్‌ను నిలబెట్టనున్నారు. అందుకే క్షేత్రస్థాయిలో ప్రజానీకానికి పరిచయం కావడంతో పాటు వారికి చేరువ అయ్యేందుకు ఆర్డీవోగా పంపినట్టు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. గూడూరు ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తూనే చాప కింద నీరులా రాజకీయ కార్యకలాపాలు చేసుకోవాలని కిరణ్‌కుమార్‌కు వైసీపీ పెద్దలు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం ఆయన అదే పనిలో ఉన్నారని సమాచారం. తాజాగా కోటలో ఆక్రమణల విషయంలోనూ ఎంఎల్ఎ వరప్రసాద్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక వైసిపి నేతలు శుక్రవారం రోడ్డుపైనే నిలదీయడం గమనార్హం.

ఇక సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకూ కౌంట్ డౌన్ స్టార్ట్ అయ్యిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ కార్యకర్త మొదలుకుని, మండల, నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ అందర్నీ ఆయన అనుమానించే పరిస్థితి. దీంతో నియోజకవర్గంలో సొంత పార్టీ నుంచే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. దీంతో సూళ్లూరుపేట కొత్త అభ్యర్థిగా తిరుపతికి చెందిన ఒక డాక్టర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వైసీపీ పెద్దల సూచన మేరకు సదరు వైద్యుడు ఆ నియోజకవర్గంలో తరచూ మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారని తెలిసింది.

సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలాన్నీ మార్చనున్నారు. టీడీపీలో గ్రూప్ రాజకీయాలు ఉన్నప్పటికీ ఎంతో ముందుగా అభ్యర్థిని ప్రకటించడం గమనార్హం. టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే హేమలత కుమార్తె హెలెన్‌ను ప్రకటించారు. ఈమెపై నియోజక వర్గంలో పాజిటివ్ టాక్ వినిపిస్తోంది. ఆదిమూలం స్థానంలో ఇద్దరి ముగ్గురి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో ఒక వైసీపీ ప్రజాప్రతినిధి పేరు కూడా వుండడం గమనార్హం. ఏది ఏమైనా ఈ మూడు చోట్ల వైసీపీ అభ్యర్థుల్ని మారిస్తేనే గెలుపు అవకాశాలు మెరుగుపడతాయన్నది అధినేత జగన్మోహన్‌రెడ్డి ఆలోచన.

వైసిపి స్టిక్కర్ల వివాదం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'జగనన్నే మా నమ్మకం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా గడప గడపకూ స్టిక్కర్లను అంటించే కార్యక్రమాన్ని వైసిపి చేపట్టింది. ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో తీవ్ర ఓటమిని చవిచూసిన ఆ పార్టీ ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు ఇంటింటికి స్టిక్కర్లను అతికించే కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించింది. అయితే ఆదిలోనే ఆ పార్టీ శ్రేణులకు స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. 'గడప గడపకూ ఎంఎల్ఎ' కార్యక్రమంలో అమ్మఒడి, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాల్లో తమకు అన్యాయం జరిగిందని, దీన్ని పరిష్కరించాలని ప్రశ్నిస్తున్నారు. సంక్షేమ పథకాలు తీసుకున్న లబ్ధిదారులు సైతం తమ ఇంటి ముందు రోడ్ల పరిస్థితి ఏంటి? వీధి లైట్లు ఎక్కడ? డ్రైనేజి కంపు కొడుతోంది అంటూ ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. చేసిన పనులకు నిధులు ఇవ్వకుండా వడ్డీలకు అప్పు తెచ్చి బిల్లులు రాక చక్రవడ్డీలు కట్టుకుంటున్నామని స్థానిక ప్రజాప్రతినిధులు ఏం మొహం పెట్టుకుని ప్రజల వద్దకు వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యతిరేకత వ్యక్తమవుతున్న ఉద్దేశ్యంతోనే అటు మంత్రులు గానీ, స్థానిక ఎంఎల్ఎలు వైసిపి స్టిక్కర్లను అతికించే కార్యక్రమానికి పెద్దగా చొరవ చూపలేదని బహిరంగ రహస్యమే. కేవలం కార్యక్రమ ప్రారంభ సూచికగా వైసిపి శ్రేణుల, కార్యకర్తల ఇళ్ల వద్దనే ఆర్భాటం చేస్తున్నట్లు విమర్శలున్నాయి. తాజాగా తిరుపతిలోని వార్డుల్లో రాజకీయాలకు అతీతంగా ఉన్న ప్రజలు మాత్రం 'మీ స్టిక్కర్లు మా ఇళ్లకు అతికించొద్దు' అంటూ మొహానే చెప్పి పంపిస్తున్నారు. ఎలాగైనా ఈ పథకాన్ని విజయవంతం చేసి జగన్ ముందు నంబర్ వన్‌గా నిలిచేందుకు ఇచ్చిన స్టిక్కర్లన్నీ అంటించేయాలని వాలంటీర్లకు అప్పగించి మమా అనిపిస్తున్నారు. ముఖ్యంగా తిరుపతిలో పరిశీలిస్తే ఇళ్ల కంటే షాపులకు అతికించడం కనిపించింది. అయితే జనసేన మాత్రం బహిరంగంగానే వైసిపి స్టిక్కర్ల కార్యక్రమాన్ని అడ్డుకుంటోంది. జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్, నాయకులు రాజారెడ్డి బృందం ఎక్కడైతే జగన్ స్టిక్కర్లు అతికించారో అక్కడికి వెళ్లి 'మాకు నమ్మకం లేదు జగన్.. మా నమ్మకం పవన్' అంటూ వైసిపి స్టిక్కర్ పక్కనే అతికిస్తూ నిరసన తెలుపుతున్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నందుకు అధికార పార్టీ జనసేన నాయకులపై కేసులు బనాయించేందుకు సమాయత్తం అవుతోంది. చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం, చంద్రగిరి, పాకాల, యర్రావారిపాళెం మండలాల్లో వాలంటీర్లను జగన్ మా ఊరికి ఏం చేశారని ఈ స్టిక్కర్లు అతికిస్తున్నారంటూ ప్రశ్నిస్తుండటం గమనార్హం. అయితే వాలంటీర్లు మాత్రం తాము ప్రభుత్వ ఉద్యోగులమని, ప్రభుత్వం ఏం చెబితే అది చేయాలి అని నిస్సహాయంగా మాట్లాడటం కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రైతులు మాత్రం ఎన్నికల ముందు ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని హామీ ఇచ్చిన జగన్, అధికారంలోకి వచ్చాక మాట తప్పి మడమ తప్పారని నిలదీస్తున్నారు. జిల్లాలో శాశ్వత నీటి ప్రాజెక్టులేమీ లేకపోవడంతో గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల మాట నీటి మూటేనా అని మండిపడుతున్నారు. రహదారుల పరిస్థితి దయనీయంగా మారిందని, వర్షం వస్తే వాగులు వంకల్లా తయారవుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. ఏదిఏమైనా వైసిపికి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి ఎదురుగాలి వీస్తోంది. ఈనెల 20 వరకూ ఏ విధమైన నిలదీతలు ఉంటాయో వేచి చూడాల్సిందే.

ముప్వా రామలింగంకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

వేసవిలో ఉద్యోగోన్నతులు, బదిలీలు జరపాలి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ఈ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలు జరపాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో పాఠశాల విద్య జె.డి.సర్వీస్ ముప్వా రామలింగంకు ప్రాతినిధ్యం చేశారు. తిరుపతి నగరంలోని స్థానిక ఎస్వీ క్యాంపస్ హైస్కూల్‌లో తిరుపతి జిల్లా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో సభ్య సంఘాలు ఈ వేసవిలో పదోన్నతులు బదిలీలు జరపాలని , 2500రూపాయలు అదనపు భతి చెల్లించి శాశ్వత ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలని, పురపాలక, నగరపాలక ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సంబంధించి ఉపాధ్యాయుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని, డి.ఎస్సీ 1998 ఉపాధ్యాయులను ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు విద్యార్థులు సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలలకు కేటాయించాలని కోరారు. ప్రతి పాఠశాలకు ఒక కంప్యూటర్ ఆపరేటర్, వాచ్ మెన్ నియమించాలని, హైస్కూల్ ప్లస్ లలో అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని తదితర ఉపాధ్యాయ సమస్యలను వివరించారు. ఈ సమావేశంలో ఫ్యాప్టో నాయకులు ముత్యాల రెడ్డి, యువశ్రీ మురళి, వెంకటముని, వెంకటరమణ, విశ్వనాథ్, నిర్మల, రమేష్ నాయుడు, నెమిలేటి కిట్టన్న, ముని శారద, బండి మధుసూదన్ రెడ్డి, ముని కష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల్లో పెత్తందారులు పాగా

బాలాయపల్లి : సర్వే నంబర్ 165-1పి4లో 11 ఎకరాల దళితుల సాగు భూమిలో పెత్తందారులు పాగా వేశారని సిపిఎం, సిఐటియు నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య మండిపడ్డారు. శనివారం బాలాయపల్లి మండలం అంబలపూడి దళితవాడలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల భూములను పెత్తందారులు ఆక్రమించుకున్నారని, 2020 నుంచి విన్నవించుకుంటున్నా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. కార్యాలయాల చుట్టూ దళితులు తిరిగి తిరిగి అలిసిపోయారని, సోమవారం గూడూరు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేస్తామని హెచ్చరించారు. దళితులకు భూములు దక్కేంతవరకూ పోరాటం సాగిస్తామన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న యాత్రికుల రద్దీ

దర్శనానికి 30 గంటలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో భక్తుల రద్దీ శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూ లైన్లు కొనసాగుతున్నాయి. వరుస సెలవులతో పాటు వారాంతపు రద్దీతో దేశం నలుమూలల నుండి తిరుమలకు వచ్చిన భక్తులతో పోటెత్తింది. శ్రీవారి దర్శనం కోసం టోకెన్ లేని భక్తులకు దాదాపు 30 గంటల సమయం పడుతోంది. అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్న ప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో ఆహారం, పాలు, తాగు నీరు అందించేందుకు టీటీడీ విస్తతమైన ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నానికి దాదాపు 79 వేల మందికి పైగా అన్న ప్రసాదం అందించగా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ క్యూలైన్లలో 80 వేల మందికి అన్నప్రసాదాలు (ఇందులో ఉప్మా, పొంగల్ ఉన్నాయి) పంపిణీ చేశారు. సాధారణం కంటే రెట్టింపుగా అన్న ప్రసాదాలు అందించారు. పిల్లలకు పాలు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు. క్యూ లైన్లలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా టీటీడీ విజిలెన్స్, పోలీసు సిబ్బంది పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 50 వేల మంది యాత్రికులు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ ఎస్ డి టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. టిటిడి ఈవో ఏవి ధర్మారెడ్డి ఆదేశాల మేరకు, జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు భక్తుల సౌకర్యాలను, క్యూ లైన్లను పర్యవేక్షిస్తున్నారు.


కమిషనర్‌కు అభినందనలు తెలుపుతున్న డిప్యూటీ స్పీకర్లు, సిపిఎం ప్రతినిధులు

అనుభవంతో అభివృద్ధి చేస్తా

కమిషనర్ హరిత బాధ్యతలు స్వీకరణ

పలువురి అభినందనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అడిషినల్ కమిషనర్‌గా గతంలో పనిచేసిన అనుభవం ఉందని, ఈ నగరం తనకు కొత్తకాదని, అందరి సహకారంతో అభివృద్ధి చేస్తానని నూతనంగా బాధ్యతలు తీసుకున్న కమిషనర్ దామలచెరువు హరిత అన్నారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై తిరుపతికి విచ్చేసిన ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరం విస్తరించేందుకు అవసరమైన మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి కృషి చేయడంతో బాటు, సర్వేక్షన్లో దేశంలో ఆదర్శవంతమైన నగరంగా తిరుపతిని తీర్చిదిద్దుతామన్నారు. హరితకు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఇ టి.మోహన్, ఎంఇ వెంకట్రామిరెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, రెవెన్యూ అధికారి కెఎల్ వర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, నాయకులు గండికోట నాగ వెంకటేష్ అభినందనలు తెలిపారు.

ఘనంగా లిటిల్ ఏంజెల్స్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ 42వ వార్షికోత్సవం వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి తిరుపతి మేయరు డాక్టరు శిరీషా ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. లిటిల్ ఏంజెల్స్ పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నతస్థాయికి చేరుకున్నారని గుర్తు చేశారు. మరో ముఖ్యఅతిథి యశోదాబాయి మాట్లాడుతూ క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మిలిగితే ఉన్నతశిఖరాలను అధిరోహించొచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులచే ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు పలువుర్ని అలరించాయి. ఆంధ్రప్రదేశ్ చరితను తెలిపే అమరావతి గీతం సభికులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారాస్మిత, చైర్ పర్సన్, ఎం.రమాదేవి పాల్గొన్నారు.

'ఉపాధి' సరే.. వసతులేవి..?

- పనిచేసే చోట కనిపించని 'నీడ' జాడ
- అందని పరికరాలతో అమోమయం
- మండుతున్న ఎండలతో కూలీల కష్టాలు

పజాశక్తి -బాలాయపల్లి

మండుతున్న ఎండలతో ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పనిచేసే చోట 'నీడ' జాడే లేకుండా పోయింది. గుడారాలు లేక ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఉదయాన్నే వెళ్లి ఉష్ణోగ్రతలు పెరిగేలోపు పనులు ముగించుకొని రావాలని చెబుతున్నారు. అలాగైతే రోజు కూలి గిట్టుబాటు కాదని కూలీలు వాపోతున్నారు. ఎండలకు గడ్డపారలు, సామగ్రి వేడెక్కి చేతులు బొబ్బలు వస్తున్నాయంటున్నారు. మార్చి నుంచి జూన్ రెండో వారం వరకు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఈ సమయంలో కూలీలకు ఎండల నుంచి ఉపశమనం పొందడానికి తగిన వసతులు కల్పించాలి. వడదెబ్బ తగలకుండా గుడారాలు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అయితే జిల్లాలో ఎక్కడా ఇలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఎండల కారణంగా కూలీలు వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది.

కూలీలకు అందని పనిముట్లు

ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు ప్రభుత్వమే పరికరాలు అందించేది. గడ్డపారలు, పారలు, ఇనుప తట్టలు, జంగిల్ కటింగ్ కోసం గొడ్డళ్లు, కొడవళ్లు ఇచ్చేవారు. క్రమక్రమంగా అధికారులు పరికరాలను ఇవ్వడం మానేశారు. ప్రభుత్వం నుంచే రావడం లేదని చెబుతున్నారు. దీంతో కూలీలే పరికరాలు సొంతంగా కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో మార్పులు చేసింది. ఇందులో వేసవి భత్యం ప్రస్తావన లేకపోవడంతో ఈ ఏడాది నుంచి కూలీలు వేసవి భత్యానికి నోచుకోకుండాపోయారు. తాగునీటి సదుపాయం కల్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మండుటెండలో మాడాల్సిందేనా?

వేసవిలో ఎండలు మండుతున్నాయి. పని చేసేచోట సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు మాత్రం ఉదయాన్నే వెళ్లి ఉష్ణోగ్రతలు పెరిగేలోపు పనులు ముగించుకొని రావాలని చెబుతున్నారు. అయితే ఎలాంటి వసతులు కల్పించడం లేదు. దీనిపై అధికారులు సైతం సరైన సమాచారం అందించలేకపోతున్నారు. ప్రభుత్వం కూలీలకు తాగునీటి సీసాలు తెచ్చుకోవడం కోసం గతంలో రోజుకు రూ.5 అదనంగా చెల్లించేది. ఈ సంవత్సరం నుంచి వాటిని ఎత్తేశారు. ఇక మజ్జిగ కూలీలకు అందించడంలో జాప్యం జరుగుతోంది. అధికారులు స్పందించి వేసవి ఎండలను దష్టిలో పెట్టుకొని పనిచేసే చోట నీడ, ఇతర సదుపాయాలు కల్పించాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

గుడారాల జాడే లేదు

ఉపాధి హామీ కూలీలు పనిచేసి ఎండలకు అలసిపోతే కాసేపు సేద తీరడానికి, మధ్యాహ్నం భోజన సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన గుడారాలను ప్రభుత్వమే గతంలో పంపిణీ చేసింది. వాటిని క్షేత్ర సహాయకులు పనిచేసే చోటుకు తీసుకెళ్లి కూలీలకు నీడ కోసం గుడారం వేయించేవారు. అయితే ప్రభుత్వం రెండేళ్ల కిందట క్షేత్ర సహాయకులను విధులను నుంచి తొలగించి తరువాత మళ్లీ తీసుకుంది. అయితే గతంలో ఇచ్చిన గుడారాలు ఏమయ్యాయో క్షేత్ర సహాయకులకే తెలియడం లేదు. అలాగే పనిచేసే చోట కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు ఇచ్చారు. అందులో గాయాలకు కట్టుకట్టడానికి మందులు, దూది, బ్యాండేజ్ ఉండేది. వడదెబ్బకు గురైన వారికి తాగించడానికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండేవి. ఆ కిట్ల జాడ నేడు కనిపించడం లేదు. 2015-16వ సంవత్సరంలో మెడికల్ కిట్లు ఇచ్చారు. తరువాత కాలం వాటి పంపిణీని విస్మరించారు. ఇకనైనా ఉన్నతాధాకారులు స్పందించి వేవవి ఉపాధి కూలీలకు అండగా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

స్వరూపరాణి, ఎంపిడిఒ, బాలాయపల్లి

ఉపాధి హామీ పథకం కూలీలకు పనులు వద్ద సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. డ్వామా పీడీ దష్టికి తీసుకెళ్లి ఉపాధి పనుల వద్ద కూలీలకు అనుకూలంగా వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం. తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తాం.

'ఉపాధి' కూలీలకు సదుపాయాలు కల్పించాలి

కెవిబిపురం : మండలంలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ అన్నారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ వామపక్ష పార్టీలు 2005లో గ్రామీణ ప్రాంతాల నిరుపేద యువకుల వలసల నివారణ అరికట్టేందుకు చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. అయితే ఈ చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు. తాజాగా బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి నిధుల కోత విధించిందన్నారు. కూలీలు పనులు చేసే చోట టెంట్లు, మజ్జిగ, మెడికల్ కిట్‌లు అందజేయాలని, జాబ్‌కార్డులకు అతీతంగా పనులు కల్పించాలని, రోజుకు రూ.600 రూపాయలు కూలి ఇవ్వాలని, ప్రతి కూలికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, కన్నెమ్మ, బాలయ్య, గురునాథం, నాగూరయ్య పాల్గొన్నారు.

గూడూరులో యువత రక్తదానం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: సినీ హీరో అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా శనివారం అల్లు అర్జున్ ఫాన్స్ అండ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సౌజన్యంతో గూడూరులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా గత కొన్నేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గంగాధర్, పూర్ణచందు, ప్రశాంత్, హర్షవర్ధన్, హేమంత, మణికంఠ, కార్తీక్, శివకుమార్, సుమంత్, వెంకటేశ్వర్లు, శివగనేష్, చందు, అఖిల్, లోకేష్, అసునితల్, శ్రీసాయి, అఖిల్, అఖిలేష్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి -గూడూరు: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న బాధితులను డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పరామర్శించారు. చిల్లకూరు మండల పరిధిలోని వరగలి క్రాస్ రోడ్డు వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి వారితో మాట్లాడారు. ఆయన వెంట గూడూరు రూరల్ సీఐ దశరథ రామారావు, చిల్లకూరు ఎస్సై గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

జైభారత్ రణభేరి కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం జై భారత్ తలపెట్టిన సామాజిక విప్లవ రణభేరి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. జై భారత్ జాతీయ కార్యదర్శి లోకనాథ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలలోని సామాజిక వెనుకబాటు తనాన్ని రూపుమాపాలని..ఈనెల 16న విజయవాడలో జరిగే విప్లవ రణభేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గూడూరు డివిజన్ నుంచి ఎస్సీ,ఎస్టీ, బీసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్ , శ్యామసుందరం, వరప్రసాద్, బోస్, నాగరా తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్ ఫలితాల్లో రిషిత్‌రెడ్డి ప్రతిభ

ప్రజాశక్తి-నాయుడుపేట: ఎస్ఓఎఫ్ ఇంటర్నేషనల్ సోషల్ స్టడీస్ ఒలంపియాడ్ ఫలితాల్లో నాయుడుపేట పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థి రిషిత్ కుమార్ ప్రతిభ కనబరిచాడు. నాయుడుపేటకు చెందిన వైసిపి తిరుపతి పార్లమెంటరీ సేవాదళ్ జాయింట్ సెక్రెటరీ చంద్రారెడ్డి, కవిత దంపతుల కుమారుడు రిషిత్ రెడ్డి నెల్లూరు నగరంలోని అక్షర విద్యాలయంలో పదో తరగతి చదువుతున్నాడు. ఒలంపియాడ్ ఫలితాల్లో ఇంటర్నేషనల్ స్థాయిలో 3147, రీజినల్ స్థాయిలో 1182, జోనల్ స్థాయిలో 141వ ర్యాంక్ తో సాధించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని పలువురు అభినందించారు.

శ్రీవారిని దర్శించుకున్న సొంటి నాగరాజు

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వెలసిన శ్రీవారిని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు సొంటి నాగరాజు దర్శించుకున్నారు. నాగరాజు మాట్లాడుతూ పవిత్రమైన ఎస్వీ విశ్వవిద్యాలయంలో శ్రీవారి ఆలయ నిర్మించడం శుభ పరిణామం అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆధ్యాత్మిక ఒరవడిని నేర్చుకోవాలని సూచించారు. ఆలయాన్ని నిర్మించిన టీటీడీ, ఎస్వీ ఉన్నత అధికారులకు కతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట శ్రీవారి ఆలయ నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఉన్నారు.

రవికి ఘన సన్మానం

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉన్నం రవిని ఘనంగా శనివారం సన్మానించారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ థియరీ పరీక్షల, స్పాట్ వాల్యుయేషన్ రెమ్యూనరేషన్ పెరుగుదలకు కషి చేసినందుకు ఆఫీసర్స్ క్లబ్‌లో ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల మూడు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వివిధ అసోసియేషన్ల సభ్యులు, ప్రాథమిక సభ్యులు రవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ సెక్రటరీ ఎర్రం రెడ్డి, చిత్తూరు బి ఎస్ కే కన్నన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మౌలా, రాయలసీమ జోనల్ ప్రెసిడెంట్ రాధాకష్ణ, చిత్తూరు జిల్లా ప్రెసిడెంట్ హేమలత సెక్రెటరీ కిషోర్ కుమార్, తిరుపతి జిల్లా ప్రెసిడెంట్ రాజనాల, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ నాగ సురేష్, సెక్రెటరీ రమణయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బియ్యం బస్తాలు వితరణ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్: తిరుపతి పద్మావతీపురంలోని 'పాస్' మనోవికాస్ బుద్ధిమాంద్య, అనాథ పిల్లల సంరక్షణ కేంద్రానికి వాకర్స్ ఇంటర్నేషనల్ వారు 10 బస్తాల బియ్యం వితరణ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆర్కాట్ కష్ణప్రసాద్ విచ్చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ లో భాగంగా పాస్ మనోవికాస్ కు బియ్యం బస్తాలు వితరణ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బా రెడ్డి, రాయదుర్గం రామమూర్తి, మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో టీడీపీ జోక్యం లేదు

ప్రజాశక్తి-కోట: 'దశాబ్దాల తరబడి కోట పంచాయతీ మీ గుప్పిట్లో ఉన్నప్పుడు అభివృద్ధి గుర్తు రాలేదా..? ఆక్రమణల తొలగింపు గుర్తు రాలేదా..? వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక నాయకుడేమో.. ఆక్రమణ దారులతో బేరాలాడుతారు.. మరొక నాయకుడేమో ఆక్రమణలు తొలగించాలని ఆవేశంతో ఊగిపోతారు.. మీ మధ్యే సఖ్యత లేదు.. ప్రతిపక్షాలను వేలెత్తి చూపడం సబబేనా..? ఆక్రమణల తొలగింపుకు వ్యాపారస్తుల అభిప్రాయాలు అవసరంగాని ప్రతిపక్షాల జోక్యం అవసరమా..? అంటూ తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ ప్రశ్నించారు. శనివారం ఆక్రమణల తొలగింపు వివాదంలో ప్రతిపక్షాల మౌనంపై వస్తున్న ఆరోపణలపై ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లుగా వైసిపీ అధికారంలో ఉందని, ఆక్రమణలు తొలగించాలంటే నిబంధనల మేరకు తొలగించండి.. టీడీపీ నాయకులకు అభ్యంతరం లేదని తెలిపారు. టీడీపీ నాయకులు మద్దాలి సర్వోత్తమరెడ్డి, షేక్ షంషుద్దీన్, దారా సురేష్, షేక్ బాబు, షేక్ నౌషాద్, సుహాసిని, మర్రి అనిల్, పోలమ్మ నందం మోహన్, తల్లం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'మా నమ్మకం..నువ్వే జగన్'

ప్రజాశక్తి-కోట: రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని సచివాలయం మండల కన్వీనర్ షేక్ మొబీన్‌బాషా అన్నారు. శనివారం కోట మండలంలోని కర్లపూడి, సిద్దవరం, కొత్తపట్నం పంచాయతీల్లో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు. వైసీపీ సీనియర్ నాయకులు కర్లపూడి సర్పంచ్ భర్త సన్నారెడ్డి చెంచు రాఘవరెడ్డి, కొత్తపట్నం ఉపసర్పంచ్ ప్రసాద్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: భాకరాపేట వైసీపీ డివిజన్ అధ్యక్షుడు తమ్మిశెట్టి గురుశంకర్ ఆధ్వర్యంలో శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి సామాగ్రిని సచివాలయ కన్వీనర్లకు అందించారు. 20వ తేదీ వరకు కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. మండల నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి, కదీర్‌అహమ్మద్, నాయకులు సాధిక్, పాళెం నరసింహ రెడ్డి, శ్రీధర్, సర్పంచులు మహేంద్ర, భూపాల్, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: స్థానిక ఎన్జీవో కాలనీలోని 14వ వార్డులో వైస్ ఛైర్మన్.డి జయప్రకాష్ ఆధ్వర్యంలో శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయప్రకాష్, కన్వీనర్ జాఫర్‌బాషా, గృహసారథులు, మస్తానమ్మ, నౌషద్‌బాషా, వాలంటీర్లు ఉష, దీప పాల్గొన్నారు.

ఉస్తికాయలపెంటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ఉస్తికాయలపెంట పంచాయతీ పరిధిలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో రూ.1.98 కోట్ల తుడా నిధులతో పలు రహదారులు అభివద్ధి జరిగిందన్నారు. అనంతరం వేరుశనగ రైతుల పొలాల్లోకి వెళ్లి కూలీలతో కలిసి మోహిత్ రెడ్డి కోత దశలో ఉన్న వేరుశనగ చెట్లను ఒబ్బిడి పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమర్నాథ్, తహశీల్దారు దస్తగిరయ్య, జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఏవో ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కిరణ్‌కుమార్‌రెడ్డి ద్రోహం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర పురోగతిని గురించి అస్సలు ఆలోచించని భారతీయ జనతా పార్టీలో మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి చేరడం ఆయన స్వార్థ రాజకీయాలకు ప్రత్యేకగా నిలుస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి విమర్శించారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి, ఆయన తండ్రికి రాజకీయ ప్రాధాన్యమిచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఆయన తన రాజకీయ స్వార్థాలు చూసుకొని రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిలో చేరుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేయడం శోచనీయమని, అసలు నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి అనే వ్యక్తి తన సొంత తమ్ముడ్ని కాంగ్రెస్‌లో నిలుపుకోలేకపోయారని, మంత్రిగా చేయని కిరణ్‌కుమార్‌రెడ్డిని ఏకంగా ముఖ్యమంత్రి స్థాయిలో కూర్చోబెట్టారని, అటువంటి కాంగ్రెస్ నాయకత్వంపై మరొక మారు విమర్శలు చేయడం జరిగితే యువ కాంగ్రెస్ నాయకులుగా చూస్తూ ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి, చిరంజీవి రెడ్డి, చిరంజీవి, భానుమూర్తి బాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-తొట్టంబేడు: తెలుగుదేశంతోనే అభివద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి చెప్పారు. 'ఇంటింటికీ మీ బొజ్జల' కార్యక్రమంలో భాగంగా మూడోరోజు శనివారం తొట్టంబేడు మండలంలోని చిన్నసింగమాల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మండలాధ్యక్షులు గాలి మురళీనాయుడు, మాజీ పాల సొసైటీ ఛైర్మన్ మునిరాజానాయుడు, రాష్ట్ర కార్యదర్శి దసరథ ఆచారి, ప్రతాప్ రెడ్డి, తులసిరామి రెడ్డి, గ్రామ నాయకులు గుర్రప్ప, సర్పంచ్ మాధవి, సునీల్, సునీల్, కమలనాథ్, జగదీశ్వర్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పాండూరు వివాదాస్పద భూములు పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాళెం మండలంలోని పాండూరు సుబ్బానాయుడు కండ్రిగలో చెన్నయ్ పురావస్తు శాఖ, సుబ్బానాయుడు కండ్రిగ పేదల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూములను సిపిఐ బృందం న్యాయ నిపుణులతో కలిసి శనివారం పరిశీలించింది. పురావస్తు శాఖ వారు తమ భూములని చెబుతున్న భూముల్లో పేదలు సాగు చేస్తున్న మిరప, వేరుశనగ పంట, నీలగిరి చెట్లు, విద్యుత్ శాఖ ఇచ్చిన విద్యుత్ సర్వీసులు తదితరాలను పరిశీలించారు. సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ ఈజిప్టు దేశంలోలా ఇక్కడ పిరమిడ్లు ఉన్నాయని, ఇక్కడ గతంలో మనుషులను పూడ్చారని, గోరీలు, శ్మశానాలు ఉన్నాయని వాస్తవ విరుద్ధమైన వాదనలు చేస్తూ అభూత కల్పనలు సృష్టిస్తున్నారన్నారు. చెన్నయ్ పురావస్తు శాఖవారు చూపుతున్న రికార్డుల ప్రకారం 1947లోనే ఈ భూములపై గెజిట్ నోటిఫికేషన్ విడుదలయ్యిందని చెబుతున్నారని, అయితే అప్పటినుంచి ఇప్పటివరకూ రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా పురావస్తు శాఖకు ఇచ్చినట్లు నమోదు చేయలేదన్నారు. రైతులకు అసైన్‌మెంట్ పట్టాలు మంజూరు చేశారని, జగనన్న కాలనీ ఈ స్థలంలోనే ఉందన్నారు. రైతుల పేర్లతోనే టెన్‌వన్ అడంగల్ రెవెన్యూ వెబ్‌లాండ్ రికార్డుల్లో ఉందన్నారు. ఎర్రమట్టి, గ్రావెల్, ఖనిజ సంపద దోచుకోడానికే పన్నాగమని విమర్శించారు. కలెక్టర్, ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళి, తరుణ్‌కుమార్, ధనంజయులు, సుబ్రమణ్యం, మునస్వామి, హైకోర్టు న్యాయ నిపుణులు పాల్గొన్నారు.

భాషా చైతన్యం కొరవడింది: తులసీనాథం

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఒకనాడు తెలుగుప్రజల భాషా చైతన్యం వల్ల దేశంలో తొలి బాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రరాష్ట్రం అవతరించిందని, నేడు ఆ భాషా చైతన్యం కొరవడిందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసీనాథం నాయుడు ఆవేదన వెలిబుచ్చారు. స్థానిక ఓ ప్రయివేట్ హోటల్‌లో తెలుగుభాషోద్యమ సమితి 17వ వార్షికోత్సవ సభ శనివారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గొప్ప చరిత్ర కల్గిన తెలుగుభాషను ఆధునిక కాల అవసరాలకు అనుగుణంగా అబివృద్ధి పరచడంలో మనం బాగా వెనుకబడుతున్నామని తెలిపారు. తెలుగుభాష ఔనత్యాన్ని అందరూ గుర్తించి, దాని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం బడి పిల్లలకు ఉపయుక్తంగా ప్రాథమిక పరిజ్ఞానంతో సమితి కూర్చిన 'తెలుగుబాల' బ్రోచర్‌ను సభలో ఆవిష్కరించి, తెలుగుబాష పరిరక్షణ కర్తవ్యం గురించి ప్రసంగించారు. విద్యార్థులు అబ్యాసం చేయడం కోసం 30 ఉన్నతపాఠశాలల్లో తెలుగుబాల పంపిణీ చేస్తున్నామని సమితి అధ్యక్ష, కార్యదర్శులు గంగవరం శ్రీదేవి, టెంకాయల దామోదరం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత రాసాని, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గార్లపాటి దామోదరం నాయుడు, ఈతరం కవికతా వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, సమితి ప్రతినిధులు వాకా ప్రసాద్, డాక్టరు తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ పొక్కల్ల సుభద్ర, ఆముదాల మురళీ, ఆకుల మల్లేశ్వరరావు, బొందు రామచంద్రారెడ్డి, మునిసిద్దారెడ్డి, ఎం.చంద్రారెడ్డి, జె.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేయడం తగదు : అఖిలపక్షం

ప్రజాశక్తి-తిరుపతి సిటి: దళితుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు దళితులపై దాడులు చేయడం తగదని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. సిపిఐ దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దళితులు, మైనార్టీలు, మహిళలపై దాడులు అనే అంశంపై శనివారం అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మురళీ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయన్నారు. డాక్టరు సుధాకర్, డాక్టరు రజినీలు వైద్య పరికరాల కొరతను ఎత్తిచూపారని కక్షగట్టి వారిపై దాడులు చేసి, వారిని మానసికంగా హింసించి దాడి చేసి చంపిన ఘనత వైసిపి ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ నెల 11న దళిత మైనార్టీ మహిళలపై దాడులను నిరసిస్తూ ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. టిడిపి నాయకులు నరసింహయాదవ్, మాజీ రాష్ట్ర మంత్రి పరసారత్నం మాట్లాడుతూ చట్టసభల్లో వామపక్షాల లేని లోటు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

రామయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలోని అశోక్‌నగర్‌లో మృతిచెందిన రామయ్య కుటుంబాన్ని శనివారం వార్డు అధ్యక్షుడు తూపిలి శ్రీని వాసులు పరామర్శించారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అందించిన రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. వార్డు నాయకులు ఆరవ శ్రీనివాసులు, చిల్లకూరు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామ మందిరంలో అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డులో కొలువై ఉన్న శ్రీరామ మందిరంలో శ్రీ రామ నవమి వేడుకల్లో భాగంగా స్వామి, అమ్మ వార్లకు విశేష పూజలు జరిగాయి. అనంతరం ముఠా వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గారా బాబూరావు , సరస్వతి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధనుంజయ రావు , హరికృష్ణ వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్, చేవూరు విజయమోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా నలంద పాఠశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి కొత్తపల్లిలోని నలంద ఉన్నత పాఠశాల 'స్నాతకోత్సవం' శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వం విద్యాసంస్థల అధినేత, అప్పుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి, రవీంద్ర భారతి విద్యాసంస్థల అధినేత బి.రవీంద్రనాథ్‌రెడ్డి, బ్రిలియంట్ హై స్కూల్ కరస్పాండెంట్ జీ.ఓం ప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నలంద హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఓబుల. వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ ఆనందరెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సభలకు కృష్ణవేణికి ఆహ్వానం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహింపబడే ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్. వి.కృష్ణవేణికి ఆహ్వానం లభించింది. తెలుగు ప్రాముఖ్యత గురించి, సాహిత్య విలువల గురించి చర్చల్లో పాల్గొంటానని కృష్ణవేణి తెలిపారు.

బీఎస్పీ పట్టణాధ్యక్షులుగా రామకృష్ణారావు

ప్రజాశక్తి-కోట: గూడూరు బహుజన సమాజ్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా కోట ప్రాంతానికి చెందిన ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్, మాజీ కమిషనర్ డాక్టర్ ఉయ్యాల రామకృష్ణారావును అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, అనుచరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర టెన్నిస్ పోటీలకు విక్రం విద్యార్థులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో పట్టణానికి చెందిన విక్రమ్ స్పోర్ట్స్ అకాడమీ కళాకారులు సత్తా చాటారు. ఐదుగురు క్రీడాకారులు ప్రథమ స్థానంలో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కిరణ్ సాయి, విశాల్ రాజ్, లీలా మహేష్, బాలికల విభాగంలో జ్యోత్స్న, విధితలు ఎంపికైన క్రీడాకారుల్లో ఉన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను విక్రమ్ స్పోర్ట్స్ అకాడమీ ఛైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ అభినందించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి -తొట్టంబేడు: పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని రాష్ట్రీయ స్వస్థ కార్యక్రమం జిల్లా అధికారి హరినాథ్ తెలిపారు . మండల కేంద్రంలోని ఈదులగుంటలోని అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారంపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి , తొట్టంబేడు వైద్యాధికారిణి ఎస్ .తేజశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

నేర వార్తలు

టిప్పర్ ఢీకొని బాలుడి మృతి

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: టిప్పర్ ఢీకొని బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలో శనివారం జరిగింది. ఎస్సై నాగార్జునరెడ్డి కథనం మేరకు.. లక్ష్మీపురానికి చెందిన కాకి వెంకటయ్య కుమారుడు కుమారుడు భరత్(11) తన స్నేహితుని సైకిల్ తీసుకుని రాజీవ్‌నగర్‌లో ఉన్న తండ్రిని కలవడానికి వెళ్లాడు. ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి భరత్‌ను ఢీకొంది. ప్రమాదంలో బాలుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. టిప్పర్ టైర్లు బాలుడిపై వెళ్లడంతో అతని తల ఛిద్రమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలుడి మృతికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను, యజమానిని కఠినంగా శిక్షించాలని సీపీఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్దన్ డిమాండు చేశారు.

తొమ్మిది మంది అరెస్టు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇనుప గొడ్డళ్లతో కడప జిల్లా ఫారెస్టు పరిధిలో అడవుల్లోకి జొరబడుతున్న 9 మందిని శుక్రవారం రాత్రి టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కే. చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో ఆర్ఎస్ఐ ఆలీ బాషా, మురళీధర్ రెడ్డి బందాలు కడప జిల్లా రాజంపేట నుండి నందలూరు వైపు వెళుతుండగా, సిద్దవటం బాకరాపేట రేంజి మండపల్లి వద్ద కొందరు వ్యక్తులు అడవుల్లోకి ప్రవేశించేందుకు వెలుతుండగా వారిని చుట్టుముట్టి వారి వద్ద ఉన్న ఇనుప గొడ్డళ్లు, ఒక మోటారు సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు.

మాజీ వీసీ ఆకస్మిక మరణం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ఆచార్య ఉదయగిరి రాజేంద్ర ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ఎస్వీయూ విసి ఆచార్య కె. రాజారెడ్డి అన్నారు. రాజేంద్ర తనకు ఎస్వీయూలో చదువుకునే రోజుల నుంచి మంచి మిత్రుడని, జువాలజీలో మంచి శాస్త్రవేత్తగా మన్ననలు పొంది ఎస్వీయూ కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేశారన్నారు. ఎస్వీయూలో పరిపాలనలో ఆచార్య రాజేంద్ర చెరగని ముద్రవేశారని, తాను స్వుటా అధ్యక్షుడిగా ఉన్నపుడు రాజేంద్ర ఉపాధ్యక్షుడుగా చక్కటి తోడ్పాటు అందించారని కొనియాడారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- తొట్టంబేడు: మండల కేంద్రానికి సమీపంలోని వాటర్ పంప్ హౌస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడినట్లు తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి సూళ్లూరుపేటకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వరదయ్యపాలెం మండలం కంచరపాలెం గ్రామానికి చెందిన తరుణ్ (19), మోహన్ రాజ్(19) ద్విచక్ర వాహనంలో శ్రీకాళహస్తికి వస్తూ అదుపుతప్పి ఢీకొన్నారు. ప్రమాదంలో యువకులు ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

ప్రజాశక్తి-తొట్టంబేడు: కంచనపల్లి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో కోడిపందాలు జరుగుతున్నట్లు సమాచారాన్ని అందుకున్న ఎస్సై రాఘవేంద్ర తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో 9 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి నుంచి రూ.3,020 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జగన్‌తోనే కురబలకు న్యాయం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కురబ, కురుమ కులస్తులకు న్యాయం చేసింది సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ కురుబ కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జంపాల శ్రీనివాసులు అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద 3, 4 తేదీల్లో జరిగిన హలో కురబ చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం అయిందని, దీంతో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రకాల పేర్లతో పిలవబడే కురబలం అందరం కలిసి ఆంధ్ర భవన్ వద్ద రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించామన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కురబ, కురమ కులస్తులను గుర్తించి వారి జనాభా ప్రకారం పదవులను కేటాయించి సముచిత న్యాయం చేసిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డి కుమార్ గౌడ్, మంగిరి రెడ్డప్ప, కోదండయ్య, యూత్ విభాగం గుండ్లూరు శ్రీనివాసులు, రుయా మల్లి, అశోక్, రెడ్డి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సముచిత స్థానానికి పోరాటం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా దేశంలోని బీసీ కులాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడంలేదని, దేశంలో జంతువులకు లెక్కలు ఉన్నాయని.. బీసీ కులాలకు లెక్కలు లేకపోవడం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు శొంఠి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారం కోసం పోరాడుతున్నామని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీసీ జన గణన చేయకుండా కాలయాపన చేస్తూ బీసీలకు రాజ్యాధికారాన్ని దూరం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాయలసీమ పర్యటనలో భాగంగా ప్రతి నియోజకవర్గం నియోజకవర్గ కేంద్రాల్లో బీసీలను చైతన్యం చేస్తూ బీసీ సేనను బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర జేసీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లాడి సత్తిబాబును నియమిస్తూ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో వీరబాబు గౌడ్, నారాయణ గౌడ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

ప్రజాశక్తి - తిరుమల: ఏ ప్రభుత్వం ఉన్నా మార్చి నెల జీతాలు ఆలస్యం అవుతాయని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు వండి శ్రీనివాసరావు అన్నారు. తిరుమల శ్రీవారిని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే రూ.1900 కోట్లు పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించిందన్నారు. పోలీసులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సరెండ్ లీవ్ పడాల్సిఉందన్నారు. ఐదు డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా మూడు డిఎలను ప్రకటించాల్సి ఉందన్నారు. ఐదు రోజుల్లో ఉద్యోగులందరికీ జతాలు పడతాయని తెలిపారు.